## 8న క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల సెలక్షన్ అండర్-14, 17 శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న ఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్ జాకబ్ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహిస్తున్నారు, గేమ్స్, స్పోర్ట్స్ అన్ని విభాగాల్లో జరుగుతాయన్నారు. సీతంపేట మండల పరిధిలో అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు హాజరుకావాలని, ఆయా పాఠశాలల్లో క్రీడాకారులను ఎంపిక చేసి సెక్షన్స్‌కు హాజరుపర్చాల్సిందిగా ప్రధానోపాధ్యాయులను, పిడి, పిఇటిలను కోరారు.

జలమయమైన బైపాస్ కాలనీ

# మన్యంలో భారీవర్షాలు

- పార్వతీపురంలో కుండపోత
- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు
- జలమయమైన కాలనీలు, రహదారులు

**బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, వీరఘట్టం తదితర మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. పార్వతీపురం పట్టణంలో సాకిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో 45 గ్రామాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే పార్వతీపురం నడిబొడ్డున గల వరహాలగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో గెడ్డ పరివాహక ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యారు. ముంపునకుగురైన ప్రాంతాల్లో నీటిని ఎమ్మెల్యే జోగారావు మోటార్లను పెట్టి తోడిస్తున్నారు.**

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో బుధవారం సాయంత్రం సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 7గంటలకు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. కుండ పోతగా కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారితో పాటు పలు వీధులు, రహదారులు జలమయమయ్యాయి. వర్షపు నీరు, కాలువల్లో మురుగునీరు రహదారిపైనే ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. ద్విచక్రవాహనాలు నీటమునిగాయి. బైపాస్ కాలనీ, సౌందర్య థియేటర్ కాలనీ, నందుమూరి కాలనీ, భారతీనగర్, దేవీనగర్‌తో పాటు పలు కాలనీల్లో వరదనీరు భారీగా చేరింది. దీంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు తీవ్ర అవస్థలుపడుతున్నారు. పట్టణంలో వరహాలగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. రాత్రంతా ఏకధాటిగా వర్షం కురిస్తే పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

**వరద నీటిలో బైపాస్ కాలనీ**

ఇదిలా ఉండగా ప్రతి ఏటా వర్షాకాలంలో బైపాస్ కాలనీకి వరదనీటి ముంపు తప్పడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన్యం జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బైపాస్ కాలనీలో వరదనీరు భారీగా చేరి బయటకు వెళ్లేందుకు అవకాశం లేక రహదారిపైనే నిలిచిపోవడంతో మంగళవారం రాత్రి నుండి బుధవారం రాత్రి వరకు కాలనీలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వీటితో పాటు వరదనీరు పలు నివాస గృహాల్లోనికి, రహదారికి ఆనుకొని ఉన్న షాపుల్లోనికి వరద నీరు చేరడంతో ప్రజల నానా అవస్థలు పడ్డారు. బైపాస్ కాలనీలో కాలువలు సక్రమంగా నిర్మించకపోవడంతో వాడుక నీరుతో పాటు వర్షపు నీరు బయటకు ప్రవహించేందుకు అవకాశం లేకపోవడంతో ప్రతిఏటా వర్షాకాలంలో కాలనీ వాసులకు ఈ సమస్య తప్పడం లేదు. శాశ్వత పరిష్కారం చేపట్టేందుకు సంబంధిత మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రతి ఏటా బైపాస్ కాలనీలో ఈ సమస్య పునరావృతమవుతుంది. వరహాలగెడ్డపై ఉన్న ఆక్రమణలతో పాటు, బైపాస్ రోడ్డు రహదారి వైపు ఉన్న కల్వర్టులు కొందరు రియల్ ఎస్టేట్ యజమానులు కప్పి వేయడంతో వరద నీరు పోయేందుకు అవకాశం లేకుండా పోయిందని కాలనీవాసులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు..

**సీతంపేట** : మండల కేంద్రంలో బుధవారం కుండపోత వర్షం కురిపిస్తుంది ఇప్పటికే ఏజెన్సీలో సరైన వర్షాలు కురకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. ఏజెన్సీలో మధ్యాహ్నం రెండు గంటల నుండి వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గెడ్డలు, వాగులు బావులు ఈ వర్షంతో పొంగి పొర్లుతున్నాయి. ఇప్పటికే వరి నాట్లు పొట్ట దశకు చేరుకున్నాయి. వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. సరైన సమయంలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. గత 20 రోజులుగా ఉదయం వేళ ఎండలు, సాయంత్రం వేళ మబ్బులతో ప్రజలు వర్షం కోసం ఎదురు చూశారు. వర్షాలు లేక మండే ఎండలతో వరి పైరు ఎండిపోతున్న సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కురిసిన వర్షంతో పంట పొలాలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని అంటున్నారు.

### విఆర్ఎస్ గేట్లు ఎత్తివేత

**మక్కువ** :మధ్యతర సాగునీటి ప్రాజెక్టు వెంగళరాయసాగర్ గోముకి రెగ్యులేటర్ ద్వారా గేట్లను ఎత్తివేసి సుమారు 600 క్యూసెక్కుల నీటిని గోముకి నదిలోకి విడుదల చేసినట్లు ప్రాజెక్ట్ ఎఇఇ ప్రశాంత్ తెలిపారు. గోముఖి పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులకు నీరు సుమారు 600 క్యూసెక్కులకు పైగా చేరడంతో అంతే స్థాయిలో దిగువకు బుధవారం నీటిని విడుదల చేయడమైందని ఆయన తెలిపారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

**మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి**

| మండలం | కురిసిన వర్షపాతం (మిల్లీమీటర్లలో) |
|---|---|
| వీరఘట్టం | 48.4 |
| సీతంపేట | 2.0 |
| భామిని | 0 |
| పాలకొండ | 18.2 |
| కొమరాడ | 8.2 |
| గుమ్మలక్ష్మీపురం | 0 |
| కురుపాం | 4.2 |
| జియ్యమ్మవలస | 3.4 |
| గరుగుబిల్లి | 22.6 |
| పార్వతీపురం | 45.8 |
| మక్కువ | 0 |
| సీతానగరం | 0 |
| బలిజిపేట | 4.2 |
| సాలూరు | 0.6 |
| పాచిపెంట | 0.6 |


ఉధృతంగా ప్రవహిస్తున్న వరహాలగెడ్డ

### పొంగి పొర్లుతున్న వెంకమ్మ సాగరం

**వీరఘట్టం** : మండలంలోని యు.వెంకంపేట గ్రామపంచాయతీ పరిధిలోని వెంకమ్మ సాగరం పొంగిపొర్లుతుంది. మండలంలోని గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు సాగరంలోకి చేరడంతో సాగునీరు వృథాగా బయటకు పోతుంది. అలాగే నడుకూరు గ్రామ సమీపములను సీతమ్మ సాగరం సాగునీరు వృథాగా బయటకు పోతుంది.

వెంకమ్మ సాగరం నుంచి కిందికి ప్రవహిస్తున్న వరదనీరు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

## మండలాల్లో జగనన్నకు చెబుదాం

### 8న సీతానగరంలో

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇకపై మండలాల్లో బుధ, శుక్రవారాలు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ మేరకు బుధ, శుక్ర వారాల్లో మండల స్థాయిలో ఈ శుక్ర వారం నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమానికి హాజరవుతారని ఆయన అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ప్రజల సమస్యలు పరిష్కారం కావాలని ఆయన చెప్పారు.

**8న సీతానగరంలో జగనన్నకు చెబుదాం**

జిల్లా కలెక్టర్ స్థాయిలో మొట్ట మొదటి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈనెల 8న శుక్ర వారం సీతానగరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుండి మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఆయన వివరించారు. సీతానగరం మండలం ప్రజలు తమ సమస్యలను తెలియజేయ వచ్చని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, ఐటిడిఏ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి. వాగ్దేవి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. విజయ గౌరి, మున్సిపల్ కమిషనర్లు జె.రామ అప్పలనాయుడు, ఎస్.సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మంత్రిని విమర్శించే స్థాయి టిడిపికి లేదు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం రాజన్నదొరను విమర్శించే స్థాయి టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు దారూ నాయక్‌కు లేదని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు కె.అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, టిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు విష్ణు నాయక్ చెప్పారు. బుధవారం ఇక్కడ స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న నాయకుడు రాజన్నదొర అని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించినట్లు చెప్పారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజన్నదొరపై లేనిపోని ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో టిఎస్ఎఫ్ జిల్లా నాయకులు భగవాన్ పాల్గొన్నారు.

## తప్పించుకున్నా తప్పలేదు

- సస్పెన్షన్..ఆపై జైలుపాలు
- విద్యుత్తుశాఖ ఎఇ శాంతారావు పరిస్థితి

ప్రజాశక్తి - పార్వతీపురం, మక్కువ

అవినీతికి పాల్పడిన ఎవరైనా ఎసిబి నుంచి తప్పించుకోలేరని విద్యుత్తుశాఖ ఎఇ శాంతారావు విషయంలో రుజువైంది. రైతు నుంచి లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఎఇ శాంతారావు తన తెలివితేటలతో తప్పించుకొని సంబరాలు చేసుకున్నా, చివరికి ఎసిబి నుంచి తప్పించు కోలేపోయారు. విధుల నుంచి తొలగించే ఉత్తర్వులతో పాటు కటకటాలు పాలవ్వడంతో అతనికి నోట్లో వెలక్కాయ పడినట్లు అయ్యింది . పొలంలో విద్యుత్తు కనెక్షన్ కోసం రూ. 60వేలు లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ అధికారిపై ఎసిబి అధికారులకు ఆ రైతు ఫిర్యాదు చేశాడు. ఆగస్టు 27న ఎసిబి అధికారులు పట్టుకునేందుకు వలవేశారు. రైతు నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకునేందుకు ఎసిబి అధికారులు ప్రయత్నించగా, పసిగట్టి తన కారులో కొంత దూరం ముందుకు వెళ్లి అందుకున్న లంచం డబ్బులను పారవేశారు. ఎసిబి సిఐ శ్రీనివాసరావు కారు ఆపాలని చేతులతో సైగ చేశారు. కారును ఆపినట్టే ఆపి స్పీడ్ గా డ్రైవ్ చేస్తూ ముందుకు తీసుకువెళ్లడంతో సిఐ శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. సెప్టెంబర్ 27న ఎఇ శాంతారావును విజయనగరంలో పట్టుకొని ఎసిబి కోర్టుకి అప్పచెప్పారు. కానీ ఎసిబి చరిత్రలోనే ఆయనకు స్టేషన్ బెయిల్ మంజూరు కావడం చర్చనీయాంశమైంది. అయితే ఐదు రోజుల తరువాత సెప్టెంబర్ 2న విధుల్లో చేరి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. ఆయనకు బెయిల్ మంజూరు వెనుక పెద్ద లాబీయింగే జరిగినట్లు చర్చ జరుగుతోంది.

**ఎఇపై హత్యాయత్నం కేసు : సిఐ**

ఇదిలా ఉండగా ఎసిబి సిఐ శ్రీనివాస్‌ను కారుతో ఢీకొని ఆయనను గాయాలపాల్జేసిన ఎఇ శాంతారావుపై ఎసిబి పోలీసులు హత్యాయత్నం చేసు నమోదుచేశారు. ఈనేపథ్యంలో ఆయనను ఎఇని ఈనెల 4న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 15వరకు కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది.మరోవైపు విద్యుత్తుశాఖ ఎస్ఇ ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎఇ అవినీతికి పాల్పడడం ఇదే తొలిసారి కాదని, గతంలో కూడా ఓ రైతు నుంచి లక్ష రూపాయి లంచం తీసుకున్నట్లు విచారణలో రుజువైందని ఎసిబి అధికారులు చెబుతున్నారు.

అవినీతికి పాల్పడిన ఎవరైనా తప్పించుకోలేరు

అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా ఎసిబి నుంచి తప్పించుకోలేరని సిఐ శ్రీనివాస్ తెలిపారు. రైతు నుంచి లంచం తీసుకొని తప్పించుకొని పారిపోవడమే కాకుండా కారుతో ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. తమ ప్రాణాలు లెక్కచేయకుండా అవినీతిపరులను పట్టుకునే ప్రయత్నంలో వారు తిరిగి తపై దాడి చేసి తప్పించుకుంటామని భ్రమ పడితే తీవ్రమైన క్రిమినల్ వాదులగా పరిగణింపబడతారని హెచ్చరించారు.

### కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులకు

## మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

### 10న కలెక్టరేట్ వద్ద 'వేడుకోలు'దీక్ష

ప్రజాశక్తి - బెలగాం

సమగ్ర శిక్ష అభియాన్, కెజిబివిల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న కలెక్టర్ కార్యాలయం ఎదుట "వేడుకోలు"దీక్ష నిర్వహించనున్నట్లు జెఎసి నాయకులు బివి రమణ, బి.ఈశ్వరరావు, కె.నరసింహాచారి తెలిపారు. బుధవారం పార్వతీపురం సుందరయ్య భవనంలో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్వశిక్షాభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కెజిబివి ఉద్యోగులకు, సిఆర్‌పిలకు, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 15 శాతం జీతాలు పెంచినప్పటికీ సర్వ శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు పెంచకపోవడం సమంజసం కాదని అన్నారు. సుప్రీంకోర్టు సూచన ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సర్వశిక్ష ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో విశిష్ట ప్రతిభ కనబరుస్తున్న ఈ విభాగంలో ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైన విధానం కాదని అన్నారు. నిర్దిష్ట కాలం ప్రాతిపదికన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మెడికల్ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ చేసే వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్ని సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఇప్పటికే అనేక దశల్లో ఆందోళన చేపట్టామని, అయినా ప్రభుత్వంలో స్పందన లేని నేపథ్యంలోనే ప్రభుత్వానికి ఉద్యోగుల గోడు తెలియజేయడానికి రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 10న కలెక్టర్ కార్యాలయం వద్ద 'వేడుకోలు" దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ దీక్షలో సర్వశిక్ష అభియాన్‌లోని అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ జెఎసి నాయకులు


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

## నూతన భవనాలకు డిప్యూటీ సిఎం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎస్.పెద్దవలస, నంద పంచాయతీకి సంబంధించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర బుధవారం ప్రారంభించారు. మండలంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దవలస పంచాయతీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ పూడి రమాదేవి, వైసిపి నాయకులు మావుడి రంగునాయుడు, తహశీల్దార్ ఎ.సూర్యనారాయణ, ఎంపిడిఒ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి దేవకుమార్, హౌసింగ్ ఎఇ సింహాచలం, విద్యాశాఖ అధికారులు, శ్యామసుందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**కృష్ణాష్టమి వేడుకలు జిల్లాలో ఘనంగా బుధవారం జరిగాయి. పలు విద్యా సంస్థల్లో చిన్నారులు కృష్ణుడి వేషాధరణలో అలరించారు. మరికొన్ని చోట్ల ఉట్టికొట్టే సంప్రదాయాన్ని కొనసాగించారు.**

**సీతంపేట** : మండలంలోని రామగిరి క్షేత్రం సమీపంలో గల భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో బుధవారం శ్రీ కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుని వేషధారణలో పలువుర్ని ఆకట్టుకొనేలా దర్శనమిచ్చారు. కృష్ణుని అవతారంలో చిన్నారులు అధిక సంఖ్యలో వేషధారణలో పాల్గొని ఆట, పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్.నవీన్ మాట్లాడుతూ కృష్ణుని జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. కృష్ణుని జన్మస్థలం, ఆయన చేసిన పనులు చిలిపి చేష్టలు విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో బోధకులు మురళీమోహన్, దివాకర్, సురేష్, మురళి, వెంకటేశ్వర్లు, పార్వతి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**కురుపాం** : మండల కేంద్రంలో గల సరస్వతి విద్యా నికేతన్ కాన్వెంట్లో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆహూతులను అలరించారు. సంప్రదాయబద్ధంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించుకుని ఉట్టి కొట్టే కార్యక్రమంతో ఆనంద హేళ మధ్య వేడుకలను ముగించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేసేందుకే కాన్వెంట్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని శ్రీ సాయి నికేతన్ హైస్కూల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాలలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉట్టి కుండను కొట్టేవారికి సాయినికేతన్ హైస్కూల్ యాజమాన్యం ప్రతినిధులు పక్కి సదాశివరావు, పెద్దింటి శ్రీధర్, చిగురువలస లీలాప్రసాద్, పెదిరెడ్డి శ్రీనివాసరావునాయుడు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రొంపిల్లి ఉదయ్ కిరణ్, బొంతాడ సత్యనారాయణ, ఇజ్జురోతు తాతినాయుడు, చందక అప్పలనాయుడు పాల్గొన్నారు.

**సాలూరు:** పట్టణంలోని రామాకాలనీ -3 అంగన్వాడీ కేంద్రం లో పిల్లలు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలతో పిల్లలు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ వేడుకల్లో ముఖ్యమైన ఘట్టం ఉట్టిని కొడుతూ పిల్లలు ఆనందించారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రాధ ఆధ్వర్యాన నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు పిల్లల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.

సీతంపేటలో కృష్ణుడు, గోపికల వేషాదరణలో చిన్నారులు

గరుగుబిల్లిలో ఉట్టికొడుతున్న సాయినికేతన్ చిన్నారులు

కురుపాంలో కృష్ణుడు, గోపికల వేషాధరణలో చిన్నారులు

సాలూరు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

## 10న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

వైయస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వా, తాతలకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం వారిచే ఈనెల 10న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు క్యాంప్ సూపర్వైజర్ సిహెచ్ వెంకటరమణ తెలిపారు ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వాయిదా పడిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 7నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు వాయిదాపడ్డాయి. వాతావరణ కారణంగా ఈనెల 12 వాయిదా పడినట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఎస్.ఉమామహేశ్వరరావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంశాన్ని క్రీడాకారులు గ్రహించాలని ఆయన కోరారు.

అచ్చెన్నాయుడును కలిసిన టిడిపి నాయకులు

## అచ్చెన్నను కలిసిన టిడిపి ఆశావాహులు

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చంనాయుడును టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు, ద్వారపురెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం కురుపాంనియోజకవర్గ టిడిపి ఆశావాహులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితులు రాజకీయ సమీకరణల గూర్చి చర్చించి పార్టీ బలోపేతానికి చేయడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆశావాహులు పువ్వుల లావణ్య, బిడ్డిక పద్మావతి, బిడ్డికి తమ్మయ్య, ఆర్ఎస్ఎస్ విజయ్ కుమార్, భూపతి దొర, కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులు, యువత పాల్గొన్నారు.

కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న సింహాచలం

## కాలువ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి ఎస్సీ, బిసి వీధిలో కాలువ నిర్మాణ పనులకు బుధవారం కో-ఆపరేటివ్ మాజీ ప్రెసిడెంట్ సింహాచలం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు దృష్టికి తీసుకెళ్లగా రూ.20 లక్షల నిధులను నిర్మాణ పనులు మంజూరు చేశారని ఆయన తెలిపారు. కాలువ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, ఎంపిటిసి సభ్యులు గౌరీ కిరణ్, నాయకులు పాల్గొన్నారు.




రాముడుగూడలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

## రాముడుగూడలో బాబు ష్యూర్టీ... భవిష్యత్తు కు గ్యారంటీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీలో రాముడుగూడ గిరిజన గ్రామంలో మండల కన్వీనర్ కె.వి. కొండయ్య ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూర్టీ భవిష్యత్ గ్యారంటీ అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమం ఆవశ్యకత, మేనిఫెస్టోలు గూర్చి ఇంటింటికి వెళ్లి వివరించి ప్రజల భవిష్యత్తుకు భరోసా కావాలంటే చంద్రబాబు నాయుడును గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కష్ణబాబు, క్లస్టర్ ఇంఛార్జి రంజిత్ కుమార్ నాయకో , యూనిట్ ఇంఛార్జి బిడ్డిక నగేష్ ,టిడిపి యువత ఆరిక సాయి,కిషోర్, తిరుపతి పాల్గొన్నారు.

## గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు ప్రతిబింబించేలా గుమ్మలక్ష్మీపురంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని టిడిపి అరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు రోజురోజుకు కనుమరుగైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే తరానికి గిరిజనుల జీవనం మనుగడ ప్రశ్నార్ధకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్కృతి, సాంప్రదాయాలు, కళలపైన గిరిజన జీవన విధానం ముడిపడి ఉందని, వాటిని పరరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని అన్నారు. ఆదివాసీ పండగలను ప్రోత్సహించి నిర్వహించాలని కోరారు.



ప్రిన్సిపాల్‌కు ప్రింటర్ అంజేస్తున్న సురేష్‌కుమార్

## పాఠశాలకు ప్రింటర్ వితరణ

ప్రజాశక్తి - కురుపాం

కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట సురేష్‌కుమార్ తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో గల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు రూ.12వేలు విలువగల ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఛైర్మన్ కె.భూషణరావు సురేష్‌కుమార్‌ను దుశ్శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రత్యేకంగా తన పుట్టినరోజున తమ పాఠశాలను గుర్తించి ప్రింటర్ డొనేట్ చేయడం అభినందనీయమని అన్నారు. తమ పాఠశాల తరఫున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పి.ఆమిటిలో పశువులకు టీకాలు

ప్రజాశక్తి - గుమ్మ లక్ష్మీపురం

వర్షాకాలంలో పశువులకు వచ్చే లంపి స్కిన్ వైరస్ అరికట్టేందుకు గిరిజన రైతులు తమ పశువులకు తప్పనిసరి టీకాలు వేయించాలని పశు సంవర్ధక సహాయకులు కె.మణికంతేశ్వరి కోరారు. పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు ఆదేశాలు మేరకు మండలంలోని పి.ఆమిటి పంచాయతీలో ఉన్న కారివలస, మొరంగూడ, గోపాలపురం, పి.ఆమిటి గ్రామాల్లో వంద పశువులకు లంపి స్కిన్ వ్యాధి సోకకుండా (బొబ్బరు వ్యాధి) టీకాలు వేసినట్లు తెలిపారు. ప్రతి రైతు పశువులకు టీకాలు వేయించి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఆవులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

# పౌష్టికాహారం.... ఆరోగ్యానికి వరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మనిషి మనుగడకు అతిముఖ్యమైంది ఆహారం. అందులోనూ పోషకాలుంటే ఆరోగ్యం బాగుంటుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా మనుషులు కొత్త రుచుల కోసం ఇష్టపడుతూ పోషకాలకు దూరమవుతున్నారు. తద్వారా అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. పుట్టినప్పటి నుంచి మరణించే వరకూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వైద్యుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తోంది. గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ, సుఖ ప్రసవాలకు, మాతా, శిశు మరణాల నివారణకు ప్రాధాన్యత ఇస్తుంది.

**భద్రగిరి ఐసిడిఎస్ పరిధిలో....**

భద్రగిరి ఐసిడిఎస్ పరిధిలో గుమ్మలక్ష్మీపురం, తాడికొండ, కేదారి పురం, రేగిడి, దుడ్డుఖల్లు సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో నెల రోజుల పాటు పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండటంతో పాటు మాతా శిశు మరణాలు నివారణకు అవకాశం ఉంటుందని తెలియజేస్తున్నారు. కొండపోడులో పండించే చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, ఊదలు, గంటెలు, మొక్కజొన్న పంటల ప్రాధాన్యత వివరిస్తున్నారు. ఎరువు లేని స్వచ్ఛమైన ఆహారం తినడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలియజేస్తున్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వంటలు ప్రదర్శనగా ఉంచి చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు పండించాలని సూచిస్తున్నారు.

**గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం**

గర్భిణుల ఆరోగ్యం కోసం శక్తిని ఇచ్చే ఆహార పదార్థాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## పోషకాహారం పై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

**గర్భిణులకు, బాలింతలకు అవసరమయ్యే ఆహారం.....**

| ఆహారం | గర్భిణులకు (గ్రాములో) | బాలింతలకు ( గ్రాముల్లో) |
|---|---|---|
| తృణధాన్యాలు | 50 | 100 |
| పప్పులు | 50 | 10 |
| ఆకుకూరలు | 25 | 25 |
| పాలు | 125 | 125 |
| కొవ్వు నూనె | 10 | 10 |
| కేలరీలు | 150-300 | 500-600 |

ప్రదర్శనగా ఉంచిన ఆకుకూరలు, కూరగాయలు, ఆహారపదార్థాలు

### ఆరోగ్య వంతులుగా ఉండేలా కృషి

భద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల ఆవరణంలో కూరగాయల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. మాసోత్సవంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు, పౌష్టికాహార వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్క గర్భిణీ, బాలింత ఆరోగ్యంగా ఉండేలా కషి చేస్తున్నాం.

**సిహెచ్ సుశీల దేవి, సిడిపిఒ భద్రగిరి**

### పిల్లల్లో ఉండాల్సిన బరువు, ఎత్తు

| వయసు | ఎత్తు ( సెం.మీ) | బరువు (కిలోలు) |
|---|---|---|
| పుట్టినప్పుడు | 48.3 | 2.9 |
| 3 నెలలు | 60.2 | 5.7 |
| 6 నెలలు | 65.0 | 7.0 |
| 9 నెలలు | 68.7 | 7.9 |
| ఏడాది | 73.4 | 9.0 |
| రెండేళ్లు | 84.4 | 11.5 |
| మూడేళ్లు | 89.7 | 12.5 |
| నాలుగేళ్లు | 96.2 | 18.9 |
| ఐదేళ్లు | 105.0 | 17.5 |

నూనె పదార్థాలు..: నూనె, నెయ్యి, డాల్డా
పోషక పదార్థాలు : వేరుశెనగ, కందిపప్పు, మినపప్పు, బాదంపప్పు
మాంసకత్తులు : చేపలు, గుడ్లు, మాంసం
రక్షణ ఇచ్చే ఆహారం : తోటకూర, పాలకూర, మెంతికూర, బెండకాయ, సొరకాయ, బీరకాయ, మునక్కాయ, టమోటా, ముల్లంగి, క్యాబేజీ, క్యారెట్, కాలీఫ్లవర్, నారింజ, పనస, మామిడి, అరటి, ఆపిల్, సీతాఫలం, జామ, నిమ్మ, దానిమ్మ తదితర పోషక పదార్థాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండొచ్చు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం!

- కూలిన నాగూరు జెడ్‌పి పాఠశాల ప్రహరీ
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు
- తల్లిదండ్రుల్లో ఆందోళన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విద్యార్థుల ప్రాణాలంటే అధికారులకు చులకనగా మారినట్లుంది. ప్రాణాలు పోయిన తర్వాత మొసలి కన్నీరు కార్చడం, బాధిత కుటుంబానికి తూతూ మంత్రంగా సాయం చేసి చేతులు దులుపుకోవడం అలవాటుగా మారింది. చిన్నారుల ప్రాణాలు గాల్లోకి కలవకముందే ముందస్తు చర్యలు తీసుకోవడంలో మాత్రం శ్రద్ధ చూపడంలేదు. మండల విద్యాశాఖాధికారులు తీరు కూడా ఇలాగే ఉంది. మండలంలోని నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నెల రోజుల కిందట కూలిపోయింది. అప్పటి నుంచి పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. కూలిన ప్రాంతంలో తాత్కాలిక నిర్మాణం చేపట్టలేదు. కనీసం ముళ్ల కంపలనైనా పెట్టలేదు. ప్రవాహరీ గోడ కూలిన తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తమ పిల్లల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడడం సరికాదని మండిపడుతున్నారు. తక్షణమే గోడ కూలిన చోట నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?**

ప్రమాదం జరిగిన తర్వాత హడావిడి చేయడం అధికారులకు అలవాటుగా మారిపోయింది. మండలానికి పక్కనే ఉన్న కురుపాం మహాత్మా జ్యోతిబాపులే బీసీ గురుకుల విద్యాలయంలో నిద్రిస్తున్న ముగ్గురు విద్యార్థులను పాము కాటు వేసిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం ఎస్టీ హాస్టల్ లో నిద్రిస్తున్న విద్యార్థిని కూడా పాము కాటేయడం వల్ల మృత్యువాతపడ్డాడు. ఈ మరణాలన్నీ సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లేనని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇలా ఎవరో ఒకరి ప్రాణం పోతేగాని విద్యాశాఖాధికారులు రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పుడు నాగూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రక్షణ కూడా కరవైంది. ప్రహరీ కూలిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకునే అవకాశముంది.

**పిల్లల ప్రాణాలకు లెకానా లేదు.**

పార్వతీపురం-పాలకొండకు వెళ్లే రాష్ట్ర రహదారి పక్కనే ఈ పాఠశాల ఉంది. ఆ స్కూల్ పక్కనే వ్యవసాయ భూములున్నాయి. వాటి నుంచి పాములు, ఇతర విష జంతువులు కూలిన ప్రహరీ గోడ మీదుగా పాఠశాలలోకి వెళ్లే ప్రమాదముంది. ప్రస్తుతం కుక్కల హడావిడి ఎక్కుగా ఉంది. పొరపాటున కుక్కల గుంపు పాఠశాలలోకి చేరితే తమ పిల్లల పరిస్థితేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలను ఆనుకుని నిత్యం రద్దీగా ఉండే రాష్ట్ర రహదారి ఉంది. ఈ రహదారి మీదుగా రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పిల్లలు ఆడుకుంటూ పొరపాటున రోడ్డు మీదకు వస్తే... ఈ ఆలోచనే భయకరంగా ఉంది. చావు ముంగిట అక్షరభ్యాసం చేస్తున్న విద్యార్థుల రక్షణకు విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇన్ని ప్రమాదాల నడుమ తమ పిల్లలను పాఠశాలకు ఎలా పంపగలమని నిలదీస్తున్నారు.

కూలిపోయిన పాఠశాల ప్రహరీగోడ

**విద్యాశాఖాధికారి స్పందన కరవు**

ఇదే విషయమై మండల విద్యాశాఖాధికారి నగిరెడ్డి నాగభూషణరావును 'ప్రజాశక్తి' వివరణ కోరగా, తర్వాత మాట్లాడుతానని చెప్పి ఫోను పెట్టేశారు. పాఠశాల విద్యా కమిటీ కమిటీ చైర్మన్‌ను ప్రహరీ గోడ నిర్మాణంపై ప్రశ్నించగా, నాడు-నేడు నిధులొస్తే పని మొదలు పెడతామని సమాధానమిచ్చారు. ఇలా ఎవరూ విద్యార్థుల రక్షణ పట్ల బాధ్యతగా వ్యవహరించకపోవడం పట్ల పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల ప్రహరీగోడ నిర్మించి, తమ పిల్లల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

## జీతాల సమస్య పరిష్కారానికి ఆర్‌జెడి హామీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో పనిచేస్తున్న ఎంఇఒ-2లకు జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నం ఆర్‌జెడి ఎం.జ్యోతి కుమారికి విజ్ఞప్తి చేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా మండల విద్యాశాఖ అధికారుల సంఘం అధ్యక్షులు సామల సింహాచలం తెలిపారు. బుధవారం ఆయన ఎంఇఒల సంఘం జిల్లా నాయకులు ఎన్.నాగభూషణరావు, మువ్వల వెంకటరమణ, ఎం.శ్రీనివాసరావు, డి గౌరునాయుడుతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. ఎంఇఒ-2 పోస్టుల్లో చేరిన ఎంఇఒలకు జూన్ నుండి జీతాలు అందలేదన్నారు. అలాగే కొంతమంది ఎంఇఒ-1 పోస్టుల్లో చేరిన వారికి పొజిషన్ ఐడిలు లేని కారణంగా జీతాలు చెల్లింపు జరగలేదన్నారు. జీతాల సమస్యను పరిష్కరించాలని ఆర్‌జెడికి విన్నవించగా చాలా సానుకూలంగా స్పందించారని, ట్రెజరీ శాఖ అధికారులతో మాట్లాడి జోన్-1 పరిధిలో పని చేస్తున్న ఎంఇఒలకు జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ఆర్జెడీకి సంఘం పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సామల పేర్కొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఎన్ఎం శ్రీదేవి

## గర్భిణులకు పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి -గరుగుబిల్లి

పోషకాహారంపై గర్భిణీలు, బాలింతలు మరింత అవగాహన పెంపొందించుకోవాల్సి ఉందని సచివాలయ ఎఎన్ఎం బోను శ్రీదేవి తెలిపారు. రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమాన్ని గరుగుబిల్లి-2 అంగన్వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎఎన్ఎం మాట్లాడుతూ గర్భిణు, శిశువులు, బాలలు, కిశోర్ బాలికలు తదితర వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. గరుగుబిల్లి, హిక్కింవలస గ్రామాల అంగన్వాడీవర్కర్లు పల్ల కృష్ణవేణి, రౌతు పద్మావతి, మూడడ్ల స్వాతి మాట్లాడుతూ సుపోషిత్ భారత్, సాక్షర భారత్, సశక్త భారత్" శీర్షికన రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిశువులకు తల్లిపాలు, అదనపుఆహారం అందించడం, పౌష్ఠికాహారం పెంపొందించడం, రక్త హీనత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. పౌష్ఠికాహారం తయారీ విధానం, చిరు ధాన్యాల వినియోగం, ఉపయోగాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్ దేవాతి మాలతి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ విశ్లేషణే పొలం బడికి కీలకం

ప్రజాశక్తి - పాచిపెంట

సాగు ఖర్చులు తగ్గిస్తూ దిగుబడి పెంచుతూ పర్యావరణానికి హాని కలగకుండా మిత్ర పురుగులను సంరక్షించుకుంటూ ఆరోగ్యవంతమైన పంట పండించాలంటే నిరంతర పర్యావరణ విశ్లేషణ పొలంబడిలో అతి ముఖ్యమైన అంశమని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని అమ్మవలసలో నిర్వహించిన డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో నిర్వహించారు. పొలంబడి రైతు బృందాలు ప్రతివారం పొలాన్ని పరిశీలించి పొలంబడి క్షేత్రంలో పరిసరాల విశ్లేషణ జరిపి ఏవైనా పురుగులు, తెగుళ్ల ఉన్నాయో వాటిని నివారించే సహజ మిత్ర కీటకాలు ఉన్నాయా సరిపడినంత తేమ భూమిలో ఉందా? వాతావరణం పంటల సాగుకు అనుకూలంగా ఉందా మొక్కల ఆవరణలో పైభాగం మధ్యభాగం, మొదలు భాగంలో ఏమైనా పురుగులు తెగుళ్ల ఉన్నాయా వాతావరణం మబ్బుగా ఉందా లేదా వర్షం పడే సూచనలు ఉన్నాయా లేదా ఎండ కాస్తుందా వంటి అన్ని అంశాలను పరిశీలించారు. ఆ అంశాలపై సమిష్టిగా చర్చించి పంట సాగుకు తీసుకోవాల్సిన నిర్ణయాలను సమిష్టిగా చేయడమే ఈ నిరంతర పంటల పరిసరాల విశ్లేషణ ఉద్దేశం. అనంతరం రైతు బృందాలు పంటలను పరిశీలించి పత్తి పంట ఆరోగ్యంగా ఉందని ప్రస్తుతానికి ఎలాంటి పురుగుమందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదని నిర్ణయించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు కూరగాయలు, ఆకుకూరలు పంటలను పెరటి తోటలుగా గాని పొలం లేదా చెరువు గట్ల మీద గాని పండించుకోవాలని సూచించారు. దీనివల్ల ఆరోగ్యవంతమైన ఆహారం లభించడమే కాకుండా ఖర్చులు తగ్గుతాయని మార్కెట్లో ధరలు కూడా స్థిరంగా ఉంటాయని తెలిపారు. ఐసిఆర్ పివిజయ్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పురుగులను, తెగులను నివారించే దశ పత్ర కషాయం తయారీ, ఆవు పేడ, మూత్రం, ఇంగువ ద్రావణం తయారీ వినియోగాన్ని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో పెరటి తోటల పెంపకం కోసం రైతులకు ఉచితంగా కూరగాయలు, విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద రేయి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు పంట పర్యావరణపై వివరిస్తున్న ఎఒ తిరుపతిరావు

పి.ఆమిటిలో శ్లాబ్ వరకే పరిమితమైన సచివాలయ భవనం

## నిలిచిన సచివాలయ భవన నిర్మాణాలు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థకు సొంత భవనాల్లేక పరాయి పంచన నడుస్తున్నాయి. నూతన భవనాలు మంజూరైనా నిధుల లేమితో పనులు సగం వరకు పూర్తయి మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం నిర్వహిస్తున్న సచివాలయాలకు సరైన సౌకర్యం లేక సిబ్బంది ఇబ్బందుల నడుమ విధులు నిర్వహిస్తున్నారు. పి.ఆమిటి, డుమ్మంగి, రాయగడ జమ్మూ, ఎల్విన్‌పేట, దుడ్డుఖల్లు, చాపరాయి బిన్నిడి పంచాయతీల్లో సచివాలయాల నూతన భవనాల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మండ నూతన సచివాలయం పూర్తయిన నేటి వరకు ప్రారంభించలేదు. గుమ్మలక్ష్మీపురంలో ఉన్న సచివాలయం నిర్మాణం పనులు పూర్తయిన రంగులు వేయాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి నూతన సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేయడం ద్వారా మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి వీలుంటుందని ప్రజలు భావిస్తున్నారు.

# ఓ వైపు విద్యుత్ కోతలు.. మరోవైపు వృథా

### పల్లెల్లో పగలే వెలుగుతున్న వీధి దీపాలు
### పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాల్లో ప్రస్తుతం విద్యుత్ కోతలు ఎడా పెడా విధిస్తున్నారు. అయితే అదే గ్రామాల్లో వీధి దీపాలు మాత్రం పట్ట పగలూ వెలుగుతున్నాయి. కురుపాం మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పగలంతా వీధి దీపాలు వెలుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి శాఖకు ఒక సిబ్బందిని నియమించారు. విద్యుత్ శాఖకు కూడా గ్రామంలో ఒకరిని లైన్మెన్‌ను నియమించారు. గ్రామంలో విద్యుత్ అంతరాయాలు కలగకుండా, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యుత్ వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత లైన్మెన్‌దే. కానీ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతూ వందలాది యూనిట్ల విద్యుత్తు వృథా అవుతుంది. గ్రామ పంచాయతీలు విద్యుత్ సంస్థలకు లక్షల రూపాయలు బకాయిలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వృథా అవుతున్న విద్యుత్ భారాన్ని వివిధ రూపాల్లో ప్రజలపై భారం మోపి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.



గాంధీ నగరలో పట్ట పగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు

మండలంలోని పలు గ్రామాల్లో పగలు, రాత్రీ అనే తేడా లేకుండా నిరంతరం వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. దీనివల్ల వందలాది యూనిట్లు విద్యుత్తు వృథా అయి గ్రామపంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రత్యేక లైన్లు ఆన్ ఆఫ్ స్విచ్లను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారమవుతుంది. ప్రభుత్వం నిరంతరం విద్యుత్తును అందించడానికి వేలకోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా విద్యుత్‌ను ఆదా చేయాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా రాత్రిపూట ఆన్ చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి కానీ అలా జరగడం లేదు. దీంతో గ్రామపంచాయతీలకు వేలాది రూపాయలు బిల్లులు వస్తున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసి ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేసి విద్యుత్ వృథా కాకుండా పొదుపు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలం లోని తుమ్మన్నకాలనీకి చెందిన ఆరిక సింధు (45) పులిపుట్టి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే తుమ్మన్న కాలనీకి చెందిన సింధు కొత్తూరు పని నిమిత్తం వెళ్లారు. పని ముగించుకొని కొత్తూరులో ఆర్టీసీ బస్సు ఎక్కి పులిపుట్టి వద్ద బస్సు దిగాడు. ఈలోగా బస్సు ముందు భాగం వైపు వెళ్లడంతో బస్సు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మేరీతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు చక్రాల కిందపడి మృతి చెందిన గిరిజనులు

## 9న జిల్లా అథ్లెటిక్స్ జట్లు ఎంపిక

**విజయనగరం టౌన్:**ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఏలూరు జిల్లా ఎఎస్ఆర్ స్టేడియంలో జరుగు జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టు ఎంపిక ఈనెల 9న విజ్జీ స్టేడియంలో జరుగుతుందని అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు లీలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు 14, 16, 18,20,23, వయసు కలిగిన బాల బాలికలు పాల్గొనవచ్చునని తెలిపారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ లేదా ఎస్ఎస్‌సి సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు.

## పాదయాత్రను జయప్రదం చేయండి

**విజయనగరం కోట :** రాహుల్‌గాంధీచేపట్టిన భారత జోడో యాత్రకు ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఈనెల 7న కాంగ్రెస్ కార్యాలయం నుంచి కోటజంక్షన్ వరకు పాదయాత్ర చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.